
డ్రెయినేజ్ కాలువ వొడ్డున పండు ముసలామె పడివుండడం చూసి గిన్నెలో గంజిమెతుకులు తెచ్చిన శాంతి కెవ్వున కేకేసింది. అప్పుడే చద్దన్నం తినడానికొచ్చిన రిక్షా రాముదు భార్య శాంతి ఎందుకలా కేకేసిందోనని పరిగెత్తుకొంటూ వచ్చాడు అక్కడికి.

'అవ్వకు రోజుమాదిరే సద్ది మెతుకులిద్దామని దగ్గరికిపోతే... యిట్టా పడిపోయివుంది. పలకరించి కదిలించబోతే నీలుక్కుపోయింది. కదల్లా-మెదల్లా. పెద్దదిక్కు అనుకొనేటోల్లం... మన పసిబిడ్డలా మనతోనేవుందని, మంచి మాటలు సెప్పుద్దని ఎన్నోసార్లనుకొన్నాం గదయ్యా... యిప్పుడెట్టా... ఊపిరుందేమో సూడింతకూ...' అంటూ కళ్లనీళ్లు పెట్టుకొంది శాంతి.

'యాడవ్వాకే... అవ్వ పాణం పొయ్యింది... ఎవురికైనా... ఎప్పటికైనా ఇది తప్పదే...' అంటూ లోపలికెల్లి చిన్న పుస్తకం తీస్కుని జేబులో పెట్టుకొని, చుట్టుపక్కనోళ్ల సాయంతో చాపమీద పడుకోబెట్టి బైటికెళ్లాడు రాముడు...

శాంతి ఏడుస్తూనేవుంది. అవ్వా అవ్వా అంటూ...

చనిపోయినవారు పిలిస్తే పలకరని తెల్సినా,



# అత్తగారి స్వర్గప్రాప్తి

తెలీని మమకారం పాడిమీద చేరేదాకా పిలుస్తూనే వుంటుంది.

కాసేపటికి కడ్డీల కట్టతో వచ్చి, కొన్ని వెలిగించి, తల దగ్గర దీపం పెట్టాడు.

'పాడెకట్టేస్తే సరి...' అన్నారొకరు. 'ఆలస్యం ఎందుకు?... ఎవరో ఏమో...తల్లో నాలుక లాగుండేది మనకు. ఏమైనా మంచి మనిషి... యింకొకరన్నారు.

'ఇంకాసేపు చూద్దాం...' అన్నాడు రాముడు.

'ఎవరున్నారని ఆగాల...' మళ్లీ వొక గొంతు.

'పైటేల దాకా చూద్దాం... అంత తొందరెందుకులే...' రాముడనడంతో మౌనంగా వొకర్నొకరు చూసుకొంటూ... అవ్వతో అప్పుడప్పుడూ మాటాడిన మాటలు గుర్తుతెచ్చుకొని చెప్పుకొంటున్నారంతా.

కొన్ని కొన్ని సందర్భాల్లో మాటాడిన మాటలకు చనిపోయిన తర్వాత మంచితనాన్ని జోడించడం సహజం...

మధ్యాహ్నం మూడుగంటలకు రాముడింటి ముందు కారాగింది. కారులో ఒకామె కూచునే వుంది. ఓ వ్యానులోంచి యిద్దరుదిగి, అవ్వను వ్యానులో ఎక్కించారు.

రాముడడ్డుచెప్పకపోవడం చూసి, 'ఎవరామె...? అవ్వనెక్కడికి తీసకపోతుండారు...' అడిగారొకరు.

'అయ్యా... వాళ్లెందుకు తీసకపోతుండారు అవ్వను...?' అంటున్న శాంతికి చెప్పినట్టుగా... 'వచ్చినామె పెద్దకోడలు... వాళ్లింటికే ఎల్లారు...' రాముడన్నాడు.

'అవ్వ దగ్గరకు ఎప్పుడూ రాలేదే...? ఆమె కారులో తిరగతావుంటే... అవ్వేమో యిక్కడీ రకంగా...'

'ఇక్కడుండేది తెలుసోలేదో... ఏమోలే... అవ్వ ట్రంకుపెట్టెలో వున్న పాకెట్ పుస్తకంలో ఫోన్ నెంబర్లు చూసి యిసయంసెప్పినా... పెద్ద కోడలు నేనొచ్చి తీసకపోతానని సెప్పింది... ఇప్పుడొచ్చినామే నాతో మాటాడినామె అయి వుంటది...'

'ఇన్ని సందేహాలెందుగ్గానీ... మనమూ బోతే బాగుంటదయ్యా... రెండేళ్లబట్టి మనమనిషిగానే వుందాయె...' అన్న శాంతి మాటలతో రాముడు శాంతిని రిక్షాలో కూచోబెట్టుకొని పోయాడు ఫోనులో తెల్సుకొన్న అడ్రసుకి.

అప్పటికే ఓ పెద్ద బంగళా ముందు షామియానా క్రింద స్టేజిమీద, పట్టు చీరలో... ధూప దీపాలతో పన్నీరు, సెంటు సీసాలు కుమ్మరించు

దోర్నాదుల సుబ్బమ్మ

కొని పూలమాలల్లో మునిగిపోయుంది అవ్వ.

శాంతి, రాముడు తమకళ్లను తామే నమ్మ లేక వొకర్నొకరు చూసుకొన్నారు. కొంతమందికి చనిపోయాక వైభవం వస్తుందనేది యిట్టాటిదే మోనని మనసులో కొచ్చింది... శాంతి, రాముడికి.

'నిండైన జీవితం అనుభవించింది. ఆరోగ్యమైన శరీరం కాబట్టే తొంభైఏళ్ళు దాటినా తన ఆలోచన ప్రకారంగానే వుండగలిగింది...'

'తనమాటే నెగ్గించుకొన్నది కొసదాకా...'

'ఆమె ఎదురొస్తే శుభం కలుగుద్దని, ఎవురి పిల్లలకైనా తన చేత్తో యిస్తే కలిసొస్తదని అడిగి యిప్పించుకొనేవాళ్లెందరో...'

'మా పిల్లలు నానమ్మా... అంటూ ఆవిడ చుట్టూరానే వుండేటోళ్లు...'

'అంతమంచిదైవుండి... ఏం కలిసొచ్చింది... కాలవ్వొడ్డున దిక్కులేని సావు సచ్చింది...' అంత ఫోర్స్‌గా మాటాడిందెవరాన్నట్టు చూసి... శాంతి నివ్వెరపోయింది.

తమ పక్కింట్లో 'విమల'... పూలమ్ము కొంటూ, రాత్రి పొద్దుపోయొచ్చి వొంటరిదాన్నని అవ్వను తీసికెళ్లి పడుకోబెట్టుకొనేది.

విమలకీసంగతి ఎలా తెల్సిందని అనుకొన్న దేగాని అడగలేదు శాంతి. ఒక్కోసారి, వొక్కక్కరి ముఖం చూస్తే అడగబోయే దేమిటో గ్రహించ వచ్చనే దానికి విమలే రుజువు.

'ఇంటికొస్తూనే విషయం తెల్సి... మనసాగక వచ్చేశా... రోజూ అవ్వకోసం తినేందుకేదో వొకటి తెచ్చినట్టే... ఈ రోజూ జిలేబి తెచ్చా... తన కోసం తెచ్చింది రుణం లేకపోయిందంటే యిదే...' విమల మాటలకు తలెత్తి చూసింది ఒకావిడ.

మా అత్తగారికి స్లమ్స్‌లో వుండేవాళ్లంటే ఎంతో జాలి. వాళ్లకోసం ఏవేవో చెయ్యాలని తపన. పెద్దకొడుకుని ఏదేదో వాళ్లకు కావాలని అడుగుతూనే వుంటుంది. ఇంతవయసులో ఎందుకమ్మా యివన్నీ అంటే వింటుందా...? రోజువారీ పనుల్లో భాగంగా... ఈరోజూ ఆ కాలవ్వొడ్డున వుండే వారికోసం వాళ్లకేదో చెయ్యాలని వెళ్లి వుంటుంది. మా మాట తీసు కోకపోవడమేగాక మాకు తెలీకుండా వెళ్లేది... ఇక ఆమెకు అడ్డు చెప్పడం ఎందుకులేనని... ఆమెకే వొదిలేశాం. చివరికి ఓ మురిక్కాలవ వొడ్డున ప్రాణం పోయిందనే మా బాధంతా...' చేతులు నలుపుకొంటూ కళ్లు తుడుచుకొందామె.

'అవునక్కా... అదే మిగిల్చింది మనకు...' వంతపలికారిద్దరు.

'హేమాహేమీల్లాంటి కొడుకులున్నా... ఆమె పద్ధతులే ఆమెవి...'


'ఆమె సంతానం గానీ... వాళ్ల సంతానం గానీ... తక్కువెవరూ లేరు...'

'ఎన్నిపూలతో పోతోంది... పేదోళ్లంటే... ఎంతిష్టమో... వాళ్లదగ్గరే చచ్చిపోయి రుజువు చేస్కొంది...'

'మంగళవాయిద్యాలతో సాగనంపు తుంటారు ముత్తైదువుల్ని. కానీ ఈమెను కూడా అంతకంటే ఎక్కువగా భావించబట్టే యిట్టా సాగనంపు తున్నారు. ఏమైనా పెద్దోళ్లు పెద్దోళ్లే... అది వొక్కొక్కరి రాత...

'ఆమె పోయినందుకు దిగులు పడాల్సిన పనేలేదు. పండు పండి రాలిపోయినట్టే... కర్తలు కాలేరు... అయితే ఆఖరి ఘడియలు ఎవురికి, ఎక్కడ, ఎట్టాగుంటాయో ఎవరూ సూసొచ్చి నోళ్లు లేరు...'

'ఏమైనా... సుఖపడ్డజీవే...'




అలా రకరకాల వ్యాఖ్యానాలు వింటున్న విమల కడుపు భగ్గుమంది.

అబద్ధాలు యింత అందంగా వుంటాయా? ఎంత ధైర్యంగా చెప్తున్నారు... మన దగ్గరి కొచ్చేసి రెండేళ్లయింది... అవ్వెంత సుఖపడిందో మనకు తెలీదా...? నేచెప్పనా... అంటూ ముందుకు రాబోతున్న విమల ముఖంలోకి చూసి, ఏమీ మాట్లాడొద్దు... అని చెప్పినట్టుగా చెయ్యి పట్టుకొంది శాంతి.

చేతి స్పర్శకు కూడా భాష వుంటుంది కాబోలు...

'సమయానికి అందరం మా అబ్బాయి పుట్టినరోజుకని వొక్కచోట చేరి వుండబట్టి ఆలస్యం కాలేదు... ఏమైనా అత్తగారి ఆత్మకు మంచి జరిగేలా ఆమె కిష్టమైనవన్నీ చేసి కర్మ గ్రాండ్‌గా చేద్దాం... స్వర్గం అందుతుంది...'

'ఎవ్వరూ చెయ్యనంత ఘనంగా చేద్దాం... పూజారితో బాగా మంత్రాలు చదివిద్దాం... పుణ్యానికిపోతుంది...'

'ఇక్కడో లేక ఎవరం వున్నచోట అక్కడో... ఎవరికి వాళ్లంగానో... మరేరకంగానైనా కర్మ క్రతువులు ముగించేద్దాం... ఈ నెలాఖరులు వేరే పనిమీద వెళ్లాల్సివుంది. కర్మచేసేదాన్ని బట్టే... స్వర్గంలో స్థానం వుంటుందటకదా...'

'కృష్ణానది మాకు దగ్గరే... అస్థికల్ని అక్కడే కలుపుదాం...'

'మేముండే చోట... అదే... రాజమండ్రిలో గోదావరి దగ్గరికి ఎంతోమంది ఈ పనిమీదనే వస్తుంటారు... మేం అక్కడ కలుపుతాంలే...'

'పెన్నానదిలో నీళ్లు నిలవున్నచోట కూడా కలిపితే మంచిదని అంటారు...'

'బెనారస్‌కి వచ్చేనెల పనిమీద వెళ్దామను కొంటున్నాం ఫ్యామిలీతో... గంగానది పవిత్ర మైంది కదా... అక్కడే కలిపేస్తే పోతుంది...'

'నా భార్య అమ్మానాన్న వాళ్లు బదరీనాథ్ వెళ్లాలంటే టిక్కెట్లు బుక్ చేసివున్నా. నా భార్య ఆ పని చేసుకొస్తుంది. ఆ దరిదాపుల్లో వున్న పుణ్యనదుల్లో కలిపి... వీలుంటే త్రివేణీ సంగమంలో కూడా కలిపి రమ్మని చెప్తా... పుణ్యం కల్గి స్వర్గం లభిస్తుంది...'

'మేము రామేశ్వరం వెళ్లాలనుకొంటున్నాం. యింకో నెలపట్టొచ్చు... చెప్పుకోదగిన పుణ్య క్షేత్రం కదా... మొత్తానికి ఆమె అదృష్టవంతురాలు కాబట్టే యిన్నిచోట్ల అస్థికలు కలవబోతున్నాయి... తప్పకుండా స్వర్గం దొరుకుతుంది.

పదిరోజుల క్రిందటే ఆదర్శవంతంగా కులాంతర వివాహం చేసుకున్న వాళ్లిద్దరూ అందరిమాటలు వింటూ... వాళ్లేం మాట్లాడాలో తోచక బిత్తరపోయి వొకర్నొకరు చూసుకొన్నారు.

మీ అభిప్రాయం ఏంటన్నట్టుగా మిగతా వాళ్లు వాళ్లవైపు చూశారు.

'వాళ్లేం చేస్తారు...? ఏం చేయగలరు? ఊరుకుండడమే మేలు... పిండం పెట్టేదాని క్కూడా...' అంటున్న రెండో కోడల్ని చూసి, 'వొదినా...' నాలుగో కొడుకు బిగ్గరగా అరిచాడు.

నాలుగో కోడలు 'స్నేహ'కి నోటమాట రాలేదు, పెళ్లి చేసుకొన్నాక భర్తతో కలిసొచ్చి అత్తగారి ఆశీర్వాదం తీసుకొని, క్షమించమని అడిగేందుకు వెళ్లి కాలువ వొడ్డున బిక్కుబిక్కుమంటూ చూస్తూ కూచున్నామెను తమతో రమ్మని పిల్చారు.


'ఆ వొక్క సంగతీ తప్ప మరేదైనా మాటాడమ్మా...' ఆప్యాయంగా తలనిమిరింది, 'మీరిలా యిక్కడుంటే... మా సుఖం మేంచూస్కుని బ్రతకడం ధర్మం కాదత్తయ్యా... అన్నపుడు నవ్విన నవ్వు చెవుల్లో ధ్వనించింది. ఆ నవ్వు తల్చుకొన్నప్పుడల్లా విన్పడ్తూనే వుంటుంది. గుండెల్ని పిండేసినంత పనౌతుంది. నవ్వులు నానా రకాలు... ఒక్కో నవ్వు వొక్కో రకమైన ప్రభావం చూపుతుంది.

"ముగ్గురు కోడళ్లూ కాస్త కలిగినోళ్లే... వాళ్లననడంలేదు ఏమీ... నా కొడుకులు నా కడుపున పుట్టినోళ్లే... ఆళ్ల సదువుల కోసం ఎన్నెన్ని తంటాలు... ఫ్చ్... తల్లిబిడ్డల్ని సక్రమంగా పెంచడం లోకంలో కొత్త సంగతేం కాదులే... పశువులు, పక్షులు కూడా ఆ బాధ్యతతోనే వుంటాయి... ఇప్పుడవన్నీ ఎందుకుగానీ... ఒక్క మాట... మనిషి మాట చెల్లని చోట, విన్పించుకోని చోట వుండడం వ్యర్థమేనన్పిస్తుంది. ఎంత ఐశ్వర్యం చుట్టూ వున్నా అంటరానిదానిగా భావించేటప్పుడు గ్రహించి దూరంగా వుంటే మంచిదనుకొన్నా..."

'నేనలా వుండనత్తయ్యా...'

'హామీలు, ప్రమాణాలు వొద్దమ్మా... ఏ యిబ్బందులూ కల్గించనని, హాయిగానే వుంటానని, రాత్రి... పగలు... చెప్పినా... నమ్మినా... అలా జరుగుతూ వుందా? ఎట్టా జరగాల్సింది అట్టా జరుగుద్ది...! ఆత్మాభిమానం వున్నపుడు అగచాట్లు తప్పవు... ఏవేవో చెప్పి నిన్ను అయోమయంలో వుంచేసానా...? నాకిక్కడ సంతృప్తిగానే వుంది. నాతోబాటు నామాటకు పెద్దతనం... నేనెవరోతెలియకుండానే నన్నభిమానించేప్పుడు ఇంతకన్నా నాక్కావాల్సిందేమీ లేదనిపించింది. అందుకే వీళ్లు ఆత్మీయులైనారు.

మీరు నూరేళ్లు అన్యోన్యంగా సుఖ సంతోషాలతో జీవితం గడపండి. నాక్కావల్సింది, మీక్కావల్సింది అదే. పోయిరండి... నా గురించిన వివరాలేమీ చెప్పొద్దు ఎవ్వరికీ...' చేతిలో




చెయ్యివేయించుకొని ముఖంలో నవ్వుపులుము కోవడం గుర్తొచ్చిన స్నేహ గందరగోళంలో పడింది.

మనిషికి గొప్పతనం అధికారంతో, ఆడంబరాలతో వస్తుందా? పిల్లల్ని పెంచి పెద్దచేసేప్పుడున్న తాపత్రయం, ఆవేదన, శ్రమ, ఆలోచన్లు, కష్టాలు, నష్టాలు అన్నీ... పిల్లలు పెద్దయ్యాక సుఖపెట్టారనే ఆశతోనే... తల్లిదండ్రులు బాధల్ని మరిచి కాలాన్ని నెట్టుకొచ్చినప్పుడు బిడ్డలు తల్లిదండ్రుల్ని విస్మరిస్తే మానవత్వం ఎక్కడున్నట్టు?

చిన్నప్పుడు తప్పుజేస్తే వారించి సరిచేస్తే... అమ్మ, నాన్నల మీద ఆరోపణలు తయారుచేసి దూరం చేసుకోవడం మనిషి తనమేనా?

హోదా వుంటే గొప్పతనం వస్తుందా? గొప్పవాళ్ల ఏం మాట్లాడినా చెల్లుబాటవుతుందా? మనసుని మోసం చేసుకునే వాళ్లు మనుషులేనా? కృత్రిమమైన ప్రేమలు, మాటలు ప్రయోజనాన్నిస్తాయా? ఎన్నో సందేహాలు... ఎన్నో ప్రశ్నలు...

చనిపోయాక చేసే కర్మక్రతువుల్నిబట్టి స్వర్గం ఆహ్వానిస్తుందా? చేసే మంచిపనుల్నిబట్టి స్వర్గం లభిస్తుందా? మంత్రాలు, తంత్రాలు, దుష్టగ్రహ శాంతులంటూ చేస్తే మోక్షానికి వెళ్తారా?

అత్తగారి స్వర్గప్రాప్తి గురించి ఎన్నిమాటలు దొర్లాయి...? 'స్నేహ'లో మళ్లీ మళ్లీ ప్రశ్నల అలజడి... భగవంతుడా... మీరు స్వర్గం అనే దాన్ని నిర్వహిస్తూంటే, కల్లాకపటాలతో వుండే వారికి కనువిప్పు కల్గించి, స్వచ్ఛమైన మనసున్న వారికి స్వర్గధామం చూపించు. మనసులో వేడుకొంటున్న స్నేహ... భర్త పిలుపుతో కళ్లు తెరిచి, మనమేం చేద్దాం...? అత్తగారి స్వర్గ ప్రాప్తికి? అంది.

నవ్వాడతను. ప్రపంచాన్ని మోసం చెయ్యాననే నిష్కర్షభావం, నిస్పృహ ఆ నవ్వులో ఉన్నాయి. ●